శిఖరం మీద...

సూర్యుడు నారింజపండులా పైకి వచ్చేశాడు.

కుళాయి దగ్గర స్నానం చేస్తున్నాడు పట్టాభి. ఆకాశగంగలా నీరు! ధారగా పడుతోంది. ఆ ధారలో ఒళ్ళంతా తడుపుకున్నాడు. చల్లగా హాయిగా వుంది.

దోసిలినిండా నీళ్ళుపట్టి నోట్లో పోసుకుని పుక్కిలించాడు. బట్టతలని కుళాయి క్రిందికి తీసుకొచ్చి, తలని అటూ ఇటూ వంచుతూ కొద్దిసేపు చిన్నపిల్లవాడిలా ఆడుకున్నాడు.

బాత్‌రూమ్ గోడలకు అమర్చిన పాలరాళ్ళని చేత్తో తడిమి చూసి, లీలగా వాటిమీద 'శ్రీరామ' రాశాడు. నున్నగా చల్లగా వుంది స్పర్శ.

కుళాయి మూతి దగ్గర అరచేత్తో అదిమి నీటి తుంపరలు ఫౌంటెన్‌లా పడుతుంటే సన్నగా నవ్వుకున్నాడు.

అంగవస్త్రాన్ని విడిచి ఒళ్ళంతా రుద్దుకున్నాడు. మళ్ళీ నీటిధార దేహాన్నంతా తడిపేటట్లు కుళాయి క్రింద కూర్చున్నాడు.

శరీరం మీద వెన్నెల సోనలూ, తేనెవాకలూ ప్రవహిస్తున్నట్లు అనిపించింది.

స్నానం అయింది. స్తోత్ర పఠనం చేస్తూ లేచి నిలబడ్డాడు. ఒళ్ళు తుడుచుకుని బయటికి రాబోయి క్షణంసేపు ఆగేడు. వో మూలగా గోడకివున్న ఇనప షెల్ఫ్‌లో నాలుగు బట్టల సబ్బులూ, ఆరు స్నానం సబ్బులూ పేర్చివున్నై. వాటి ప్రక్కగా వొక పెద్ద సర్ఫ్ పాకెట్, నాలుగు శీకాయ సబ్బులు, రెండు సబ్బుపెట్టెలు వున్నై.

వాటివైపు చిత్రంగా చూసి బయటికి వచ్చాడు. ఎన్ని నీళ్ళు...ఎన్ని నీళ్ళ ! చల్లగా హాయిగా వుంది. ప్రాణం గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది అనుకున్నాడు.

ఆనంద తరంగాల్లో వోలలాడుతున్న మనస్సు హఠాత్తుగా చూపు మరల్చుకుంది. మరుక్షణం పట్టాభి ముఖ కవళికలు మారిపోయినై. దేహం ముడుచుకుపోతున్న భావన కలిగింది. క్షణం క్రితం తాను అనుభవించిన ఉత్సాహం, ఆనందం, ఆహ్లాదం, హాయి, చల్లదనం కరిగిపోయినట్లయినై.

దీర్ఘంగా నిట్టూర్చేడు. నెమ్మదిగా, యాంత్రికంగా వంటింట్లోకి నడిచి, ఇంత విభూతి తీసి ముఖాన్న పెట్టుకుని ఓ పక్కగా వేసి వున్న పీటమీద కూర్చోబోతూ ప్రక్కకి చూసేడు.

గ్యాస్ స్టవ్‌మీద వొకవైపు పాలు కాగుతున్నై. పెద్ద స్టీలుగిన్నె నిండా తెల్ల'ని పాలు ! మీగడ కట్టబోతున్నై.

మరోవైపు ఇడ్లీ పాత్ర. వాటివైపు నింపాదిగా చూస్తూ వుస్సురని నిట్టూర్చేడు.

" ఓవర్ హెడ్ టాంక్ వలన నీళ్ళ బాధ లేదు. బాగున్నైకదూ ! " అడిగింది శారద.

ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు పట్టాభి.

" ఆఁ...ఆఁ...చాలా బావున్నై " అంటూ ఆమెకేసి చూశాడు.

అప్పటికప్పుడే తలారా స్నానంచేసి జుట్టుని వొదులుగా ముడివేసుకుని, ఫెళఫెళలాడుతున్న సంపంగి రంగు కోటా చీరె కట్టి, అదే రంగు జాకెట్‌తో స్వచ్ఛంగా వుంది శారద. నొసట ఎర్రని బొట్టు, చెవులకు ఎర్రరాళ్ళ దిద్దులు, ఎడమ ముక్కుకు వజ్రపు ముక్కుపుడక, మెడలో ముత్యాలదండ, నల్లపూసలు, రెండు పేటల గొలుసు, ఒక్కో చేతికి ఆరేసి బంగారు గాజులు— సిరిసంపదల కలయికకు రూపకల్పనగా కనిపిస్తోంది. నిలబడి క్యాబేజీ తరుగుతోంది శారద.

చూపు మరల్చుకుని పీటమీద కూర్చుని గాయత్రికి వుపక్రమించాడు.

ఒక అరగంట గడిచింది.

వాణి, రాజు, రాణి లేచి వచ్చారు. తాతయ్యని చూస్తూనే వాళ్ళకి సంతోషమైంది. ఉత్సాహంగా కబుర్లలో పడ్డారు. పిల్లల ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్నాడు పట్టాభి.

వాళ్లేమో తమ యింటిని గురించీ, స్కూలు గురించి విశేషాలన్నీ ఏకరువు పెట్టున్నారు. మధ్య మధ్య అవసరమైన వివరణల్ని ఇస్తూ, తన పని తాను చేసుకుంటున్నది శారద.

పిల్లలు ముగ్గుర్నీ తేరిపార చూశాడు పట్టాభి. పులుగడిగిన ముత్యాల్లా అందంగా ఆరోగ్యంగా వున్నారు. వచ్చీ రాని వయసులో గుమ్మటంలా వుంది వాణి. తల్లి పోలిక. పచ్చని కళ గల మొహం. పచ్చి చక్కెరకేళిలా పొట్టిగా బొద్దుగా వున్నాడు. పదేళ్ళ రాజు. ఐదేళ్ళ రాణి రబ్బరు బొమ్మలా మిసమిసలాడుతోంది. కళ్ళు విచ్చుకుని వాళ్ళనే చూస్తూ ఆలోచనలో పడ్డాడు పట్టాభి.

“ ఇంక మీరు లేచి తయారుకండి. టైమవుతోంది ” పిల్లల్ని హెచ్చరించింది శారద. ముగ్గురూ కదిలేరు.

“ గృహప్రవేశానికి మీరు రానేలేదు. ఇల్లు ఎలా వుంది ? ” అడిగింది శారద.

తండ్రికి ఇంట్లో అన్ని గదులూ, పెరడూ, ఆవరణా అన్నీ చూపించి మార్నింగ్ వాక్‌కి వెళ్ళాడు రామ్మూర్తి.

“ చాలా బాగుంది. మీ రిద్దరూ దగ్గరుండి కష్టపడి కట్టించుకుంటిరి. అన్నీ పొందిగ్గా అమరినై ” అని, “ వద్దామని ఎంతో ప్రయత్నించాను. వీలుకాలేదు. జాబు రాశాను కదూ ” అన్నాడు.

" అవును " అని వూరుకొంది శారద. ఆ సంభాషణని ఇంకా పొడిగిస్తే మామగారి మనస్సు నొచ్చుకుంటుందని అక్కడితో ఆపేసింది.

పట్టాభి వంటగదిని కలయజూశాడు. వల్లని చలువరాతితో పదడుగుల గట్టు. దాని చివర నీటి కొళాయి, సింక్, చలువరాతి దిగువన వివిధ సైజుల్లో అరలు అరలుగా చెక్కలతో షెల్ఫ్‌లు, రెండో ప్రక్క రాతితో అరలు—డబ్బాలు, సీసాలు, గిన్నెలతో నిండివున్నై. వొక అర నిండుగా పింగాణీ, గాజు సామాన్లు, గ్లాసులు—ట్రేలు. ఆధునిక గృహిణికి అందుబాటులో వుండాల్సిన వస్తువులన్నీ నిండుగా వున్నై. వంటగదిని ఆనుకుని ఆరడుగుల నడవా. వంటగదికి ఎదురుగా డైనింగ్ రూమ్.

పూజ పూర్తయిందనిపించి వంటింట్లో నుంచి కదిలేడు పట్టాభి పిల్లలు మొహాలు కడుక్కొని వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గరికి చేరేరు. తాతయ్యను ఆహ్వానించి తమ ప్రక్క కుర్చీలో కూర్చోబెట్టేరు.

మూడు స్టీలు గ్లాసుల నిండా పాలు కలిపి తెచ్చింది శారద. పిల్లలు ముగ్గురూ అందుకున్నారు.

" వీళ్ళకి కాఫీ అలవాటులేదు. రోజూ పొద్దున్నే పాలే తాగుతారు. " అంటూ కాఫీ గ్లాసుని మామగారి ముందు వుంచింది. కాఫీ తాగుతూ పిల్లలకేసి చూశాడు పట్టాభి. హఠాత్తుగా ఒక భావన కలిగింది. ' ఇందుకనే కాబోలు కూడే మెరుపు ' అన్నారు—అనుకున్నాడు.

చూపులు త్రిప్పుకున్నాడు. శారద వంట యింట్లో గాజు గ్లాసులోని నిమ్మరసంలో తేనె కలుపుకుని తాగుతోంది.

పిల్లలు స్నానాలకు లేచారు. పట్టాభి కూడా అక్కణ్ణుంచీ ముందు హాల్లోకి కదిలేడు. చూసిన గదే అయినా కొడుకూ, కోడలూ తమకోసం ఎంతో ప్రత్యేకంగా కట్టించుకున్న పడగ్గది గడప దగ్గర నిలబడ్డాడు. తలుపును అనుకుని నిలిచి, డోర్‌కర్టెన్ తొలగించి లోపలికి చూసేడు.

విశాలమైన డబుల్ కాట్. దానిమీద ఖరీదైన పరుపూ, దుప్పట్లూ, దిండ్లూ, ఉదారంగు పెయింట్‌వేసి వున్న గోడలు. కిటికీలకి ముదురు ఎరుపు తెరలు. గోడలకి రెండు మూడు ప్రకృతిని చిత్రించిన పటాలు వ్రేలాడదీసి వున్నై. మంచం పక్కగా టేబుల్ లైట్, డెకొలామ్‌తో చేసిన టీపాయ్. వీటికి ఎదురుగా గోడకి నిలువు టద్దం. ఆ గదిని ఆనుకుని ఒక బాత్‌రూమ్ వుంది. దాన్లోనూ పాలరాతి గోడ, షవర్ కనిపిస్తున్నై బయటికి.

ఎందుకో హఠాత్తుగా ఒక భావన కలిగింది పట్టాభికి. హాల్లో రామ్మూర్తి గొంతు వినిపించింది. చేతిలోని తెర వదిలేసి దీర్ఘంగా నిట్టూరుస్తూ అక్కణ్ణుంచీ కదిలేడు. గబగబా అడుగులు వేస్తూ హాల్లో కొచ్చి వాలుకుర్చీలో కూర్చుని దినపత్రికని చూడసాగేడు.

పిల్లలు స్కూలుకు వెళ్ళిపోయారు. ఆసరికి రామ్మూర్తి స్నానంచేసి వచ్చి తండ్రి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"ఇంటికి ఇంక వొక్క పని మిగిలింది. డాబామీద వొక గదీ, వరండా వేయించాలి. ప్లానులో వుందిగానీ, త్వరగా ఇంట్లో చేరిపోవాలనే వుద్దేశ్యంతో ఆపించాము. అవి పూర్తయితే, స్నేహితులూ—వాళ్ళూ ఎవరొచ్చినా ఫర్వాలేదు. డాబామీద వాళ్ళకి ప్రత్యేకంగా అతిథి గృహం వున్నట్లుంటుంది." తండ్రి ఏమీ అనలేదు. రామ్మూర్తి ఆయనవైపు చూశాడు. ఆయనేదో పరధ్యానంలో వున్నాడు.

ఇంతలో శారద వచ్చింది. చేతిలోని మజ్జిగ గ్లాసుల్ని చెరొకటీ ఇచ్చింది. వెన్న చిలికిన మజ్జిగ నురుగులు తేల్తూ గ్లాసునిండా వున్నై.

మజ్జిగ తియ్యగా కమ్మగా వున్నై పట్టాభికి. ఖాళీ గ్లాసును ఇస్తూ మెచ్చికోలుగా శారదను చూసి, రామ్మూర్తికేసి చూపులు మరల్చి "చాలా బావున్నై మజ్జిగ" అన్నాడు. భార్యవైపు చూస్తూ నవ్వుగా నవ్వేడు రామ్మూర్తి. ఆమె కూడా నవ్వుగా నవ్వింది.

ఇద్దర్నీ గమనించాడు పట్టాభి. ఎందుకో హఠాత్తుగా వొక భావన కలిగింది. ఆ భావన ఆయన్ని ఆపాదమస్తకం వుడికించి చీల్చి పారేస్తున్నట్లనిపించింది. దినపత్రికని పక్కన పడేసి, లేచి, బయటికి నడిచేడు.

పట్టాభికి మనసంతా వికలమై వుంది. ఏఁవీ తోచడంలేదు.

రోడ్డువార కొంత దూరం నడిచేడు.

కొడుకూ—కోడలూ—పిల్లలూ, ఆ యింటి వాతావరణం, పరిస్థితులూ—ఆయనలో అనేక భావాలు కలిగిస్తున్నై.

కాసేపు—ఆ భావాల్లో చిన్నతనం, సిగ్గు, బిడియం కూడా వున్నాయనిపిస్తోంది. దుఃఖమో, ఆనందమో తెలియకుండా కళ్ళు చెమరుస్తున్నాయి.

జీవితంతో తాను పట్టిన కుస్తీపట్లన్నీ సినిమా రీలులా గిర్రున కళ్ళముందు తిరిగినై. అందునా, ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళూ, భార్య మరణం...పై పంచతో కళ్ళొత్తుకున్నాడు పట్టాభి.

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఇంటికి తిరిగి వచ్చాడు.

మధ్యాహ్నం—

భోజనాల దగ్గర.

వెండి కంచంలో చాలా పదార్థాలు వడ్డించి వున్నై.

'షడ్రసోపేతమైన విందు' అనుకున్నాడు పట్టాభి. పచ్చి కారెట్‌ని కోరి కొబ్బరి కలిపి పెట్టింది, శారద. చాలా రుచిగా వుంది. సంతృప్తిగా తినబోతుండగా, వొక చిత్రమైన భావన కలిగింది.

ముద్ద గొంతు దిగలేదు. పొలమారినట్లయింది. మంచినీళ్ళు తాగి సంభాళించుకున్నాడు.

ఆ తర్వాత—

అక్కడ ఎక్కువసేపు మౌనమే రాజ్యమేలింది. కొడుకు వేసిన ఒకటి రెండు ప్రశ్నలకి పొడి పొడి సమాధానాలు చెప్పాడు.

భోజనం అయిందనిపించి లేచాడు పట్టాభి.

గడ్డ పెరుగు కూడా సరిగా వేసుకోలేదని బాధ పడింది శారద.

"పిల్లల గదిలో మంచం వేశాను. విశ్రాంతి తీసుకోండి"—శారద చెప్పింది.

యాంత్రికంగా గదిలోకి నడిచాడు. పక్కమీద నడుం వాల్చేడు. ఫోమ్‌బెడ్ మెత్తగా తగిలింది. చాలా హాయిగా అనిపించింది.

కానీ, అంతలోనే ఏదో భావన!

ఆ భావన ఆయన్ని ఆపాదమస్తకమూ ఉడికించి, చీల్చి పారేస్తున్నట్లనిపించింది. తక్కున లేచి కూర్చున్నాడు.

గదిలో పచార్లు చేయసాగేడు.

ఆలోచనలతో, అస్థిమితంతో—గంట గడిచింది.

నిమ్మళంగా పడగ్గది దాకా నడిచేడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఏ చడీ చప్పుడూ లేదు. రామ్మూర్తీ, శారదా విశ్రాంతి తీసుకుంటున్నట్లుంది.

పట్టాభికి ఏఁవీ పాలుపోలేదు. ఆయన మనస్సు మనస్సులో లేకుండా పోయింది.

మొండిచెట్టులా అయిపోయేడు.

ఉదయం పిల్లలు కోరిన కోరిక గుర్తుకొచ్చింది. "నువ్విక్కడే ఇంచక్కా మా దగ్గరే వుండిపో తాతయ్యా" అన్నారు వాళ్ళు. శారద కూడా చెప్పింది—"పది రోజులు విశ్రాంతిగా వుంటుంది. ఇప్పుడిప్పుడే వెళ్ళే ఆలోచన చెయ్యకండి!!". రామ్మూర్తి అన్నాడు "చెప్పుల్లో కాళ్ళు పెట్టుక్కూర్చోకు. కొన్నాళ్ళుండి వెళ్ళొచ్చు."

కానీ, అంతరంగంలో ప్రవహిస్తున్న భావన ఆయన్ని నిలవనీయడంలేదు.

క్షణంసేపు అటూ ఇటూ చూసి, హఠాత్తుగా తన సంచీ చేతిలోకి తీసుకున్నాడు. గబగబా అడుగులు వేస్తూ బయటికి వచ్చేశాడు.

మళ్ళీ వెనక్కి వెళ్ళి వీధి తలుపుని వేసేసి వచ్చాడు.

ఆయన కాళ్ళు బస్‌స్టాండుకేసి పరుగులు తీసినై.

బస్ కదిలింది.

రామ్మూర్తి ఇంట్లో జరిగిన బలీయమైన మానసిక సంఘర్షణ గుర్తుకొచ్చింది పట్టాభికి.

కళ్ళముందు మసక మసగ్గా ఏవేవో దృశ్యాలు కదలాడినై.

అటెండర్ చలపతి నివసిస్తున్న రెండు గదుల అద్దె కొంప ; మాసికల చీరల్తో కడుపులో కాళ్ళుంచి కాలాన్ని వెళ్ళదీస్తున్న చలపతి భార్య సుమతి. గోగు కాడల్లా నలుగురు పిల్లలు. తెల్లవారితే ఎదురయ్యే సీటి ఎద్దడి ! సమస్యల బుట్టని నెత్తికెత్తుకుని, సహనం చెప్పుల జతతో బతుకీడుస్తున్న చలపతీ—అతని సంసారం !

“ ప్రాపంచిక శక్తికీ, నైతిక శక్తికీ జరిగిన ఘర్షణ—నన్నూ—నా ప్రవర్తననీ కొద్దిసేపు కత్తి అంచుమీద నిలబెట్టింది. ” అనుకున్నాడు పట్టాభి.

ఆ వెంటనే అనిపించింది. “ నేను సరిహద్దులు దాటి వెళ్ళలేదు. ”

* * * *

శేషజీవితాన్ని రామ్మూర్తి వాళ్ళింట్లో గడుపుతానని వెళ్ళి, రెండో రోజునే తిరిగి వస్తున్న పట్టాభిని చూసి ఆశ్చర్య పోయారు—చలపతీ, సుమతీ !

వాళ్ళిద్దరి వైపూ తదేకంగా చూస్తూ, అప్రయత్నంగా నవ్వేడు పట్టాభి.

ఎంతో తేలికగా, హాయిగా, వెన్నెలలా—హార్దికంగా వున్నట్లనిపించింది !

నులకమంచంమీద వడుం వాల్చి చూరుకేసి చూస్తూ తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు !

బుద్ధి తెలిసినప్పట్నుంచీ తనతోపాటు కాడి మెడమీద వేసుకుని, రామ్మూర్తిని ఇంజనీరుని చేసి, ఇంతవాణ్ణి చేయటమే కాక, ఇంటి బాధ్యతల్నీ నెత్తిన వేసుకుని ఆడపిల్లల పెళ్ళిళ్ళూ వగైరాలన్నీ నిర్వహించిన పెద్దకొడుకు పట్ల—పట్టాభి గుండె నిండా కృతజ్ఞత నిండిపోయింది.

తండ్రివైపు చిత్రంగా చూశాడు—చలపతి. అతనికి ఆయన కొంత అర్థమయ్యాడు—కొంత అర్థం కాలేదు. సాలోచనగా భార్యకేసి చూశాడు. నాకు అంతా అర్థమైంది అన్నట్టు కళ్ళు చికిలించింది సుమతి! శిఖరంమీద చిరంజీవిలా—గంభీరంగా భవిష్యత్తుకేసి చూస్తున్నాడు—పట్టాభి.

పట్టాభిగారి ట్యూషన్ పిల్లలు బిలబిలా వచ్చేస్తున్నారు!

అక్కడ—రామ్మూర్తీ, శారదా—పట్టాభిగారి బలహీన తల్ని గురించి చర్చించుకుంటున్నారు!

0~0~0